సాక్షి విజయనగరం

గురువారం । 14 । నవంబర్ । 2024

స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలను శతశాతం సాధించాలి

• జేసీ సేతు మాధవన్



విజయనగరం అర్బన్: స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలను శత శాతం సాధించాలని జేసీ సేతుమాధవన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన తన చాంబర్‌లో వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులతో 100 రోజుల ప్రణాళికల పురోగతి, వచ్చే వందరోజుల కార్యాచరణ ప్రణాళిక, ఏడాది, మూడేళ్ల, ఐదేళ్ల ప్రణాళికలపై సమీక్షించారు. నివేదికలలో కచ్చితంగా రాయాలని అధికారులకు సూచించారు. ప్రతి శాఖ వారి లక్ష్యాలను ఆన్‌లైన్‌లో పెట్టేటప్పుడు కలెక్టర్ ఆమోదం తప్పనిసరిగా పొందాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ, మత్స్య, పశు సంవర్ధక, ఉద్యాన, పట్టు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు వంగర విద్యార్థి



వంగర: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి బొడ్రోతు కృష్ణ జాతీయస్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలకు ఎంపిక య్యాడు. ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న వాలీబాల్ పోటీల్లో ఏపీ జట్టు తరఫున తలపడతాడని హెచ్‌ఎం ముద్దాడ రమణమ్మ, పీడీ కవిత తెలిపారు.

న్యూస్‌రీల్

25 నుంచి 108 ఉద్యోగుల సమ్మె

• 108 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పలనాయుడు



ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న 108 ఉద్యోగులు

విజయనగరం ఫోర్ట్: సమస్యల పరిష్కారంలో టీడీపీ కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసగా ఈ నెల 25 నుంచి 108 ఉద్యోగులు సమ్మెచేయనున్నట్టు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు వి.అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.రాణికి సమ్మె నోటీసును బుధవారం అందజేశారు. 108 సర్వీసులను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. స్లాబ్‌ల ప్రకారం ఉద్యోగులందరికీ వేతనాలు చెల్లించాలన్నారు. సర్వీసును బట్టి ఎప్పటికప్పుడు స్లాబ్‌లను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో ఈఎంటీ పోస్టుల్లో 108 ఈఎంటీలను నియమించాలని కోరారు. 8 గంటల పని విధానం అమలు చేయాలని కోరారు. సహజ మరణం, ప్రమాదాల్లో చనిపోయిన ఉద్యోగులకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో పుష్ప పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్



సమావేశంలో పాల్గొన్న న్యాయమూర్తులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీలపై మోటారు బీమా కేసులకు సంబంధించి అధికారులతో ఈ నెల 14న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. ఈ మేరకు కంపెనీ అధికారులతో బుధవారం సమావేశమయ్యారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి చాంబర్‌లో నిర్వహించే అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలన్నారు. సమావేశంలో న్యాయమూర్తులు కె.నాగమణి, పోక్సో కోర్టు జడ్జి, ఎస్సీఎస్టీ కోర్టు జడ్జి అప్పలస్వామి, మహిళా కోర్టు జడ్జి పద్మావతి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.వి.రాజేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ కోచ్‌గా శ్రీరాములు



శృంగవరపుకోట: మధ్యప్రదేశ్‌లోని నర్మదాపురంలో ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ బ్యాడ్మింటన్ అండర్-17 ఆంధ్రా జట్టు కోచ్‌గా ధర్మవరం జెడ్పీ హైస్కూల్ పీడీ డాక్టర్ పి.శ్రీరాములు ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన భారత బ్యాడ్మింటన్ అసోసియేషన్ గ్రేడ్-1 అంపైర్‌గా పలు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. 2010లో ఢిల్లీలో నిర్వహించిన కామన్‌వెల్త్ క్రీడలకు టెక్నికల్ అఫీషియల్‌గా వ్యవహరించారు. మరోదఫా శ్రీరాములు జాతీయ పోటీలకు కోచ్‌గా ఎంపిక కావడంపై క్రీడాభిమానులు, జిల్లా బ్యాడ్మింటన్ అసోషియేషన్ సభ్యులు శ్రీరాములుకు అభినందనలు తెలిపారు.

20లోగా బ్యాంకు గ్యారంటీలను సమర్పించాలి

• జేసీ సేతు మాధవన్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్

విజయనగరం అర్బన్: ధాన్యం కొనుగోలులో భాగంగా మిల్లర్లు ఈ నెల 20వ తేదీలోగా బ్యాంకు గ్యారంటీలను సమర్పించాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. తన చాంబర్‌లో పౌర సరఫరాల అధికారులు, మిల్లర్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు గోనె సంచులను సిద్ధం చేయాలని మిల్లర్లకు సూచించారు. సమావేశంలో డీఎస్‌ఓ మధుసూదనరావు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ మీనాకుమారి, మిల్లర్లు పాల్గొన్నారు.

బాల్యంలోనే భవితకు పునాది



• పాఠశాల స్థాయిలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి
• లక్ష్యం సాధించేవరకూ వెనకడుగు వేయవద్దు
• పిల్లలను సరిదిద్దాల్సిన తొలి బాధ్యత తల్లిదండ్రులదే..
• చిన్నారులందరికీ చిల్డ్రన్స్ డే శుభాకాంక్షలు
• కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఆయన చిన్నప్పుడు బీఆర్ అంబేడ్కర్ మాత్రమే. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ఆ పేరు పెట్టానని, కానీ డాక్టరేట్ నీవే సాధించాలని తండ్రి తనకు చిన్నప్పుడు చెప్పిన మాటే తారకమంత్రం అయ్యింది. పట్టువిడవకుండా డాక్టరేట్ పొందడమే గాక అత్యున్నత ఉద్యోగమైన ఐఏఎస్‌నూ సాధించారు. ఆయనే మన జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్. 'నేటి బాలలే రేపటి పౌరులు. భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదగాలంటే అందుకు పునాది బాల్యంలోనే పడుతుంది. మన భవిత ఎలా ఉండాలో అందుకు అవసరమైన లక్ష్యాన్ని పాఠశాల స్థాయిలోనే నిర్దేశించుకోవాలి. చదువుతో పాటు శారీరక, మానసిక ఉల్లాసం కలిగించే క్రీడలు, సంగీతం వంటి హాబీలను అలవర్చుకోవాలి. అహర్నిశలు తదేక కృషితో లక్ష్యాన్ని సాధించాలి. భావిభారత పౌరులుగా ఉత్తమ మార్గంలో ఎదగాల్సిన పిల్లలందరికీ చిల్డ్రన్స్ డే శుభాకాంక్షలు' అని ఆశీస్సులు అందించారు. గురువారం 'చిల్డ్రన్స్ డే' సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

• 'డాక్టరేట్' సాధించేవరకూ విద్యాభ్యాసం...

ఉన్నతమైన సబ్ కలెక్టర్ ఉద్యోగం వచ్చినా 'డాక్టరేట్' కోసం నా ప్రయత్నం ఆపలేదు. న్యాయశాస్త్రం (ఎల్ఎల్‌బీ) చదివాను. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచే జర్నలిజంలో డీసీజే కూడా పూర్తి చేశాను. తర్వాత పీహెచ్‌డీ చేశా. అలా మా నాన్నగారు ఆశించిన 'డాక్టరేట్' సాధించాను. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అయ్యాను.

• మానసిక ఉల్లాసం ముఖ్యం...

పిల్లలకు ఎప్పుడూ చదువొక్కటే కాదు.. ఆటలు, సంగీతం, నృత్యం వంటి హాబీలు కూడా భాగమవ్వాలి. వాటితో మానసిక ఉల్లాసం కలుగుతుంది. తద్వారా శారీరకంగా, మానసికంగా దృఢత్వం వస్తుంది. పాఠశాల స్థాయిలో నేను కూడా స్పోర్ట్స్‌లో ముందుండేవాడిని.

• పాఠశాల స్థాయిలోనే లక్ష్యం...

చిన్నారులకు జీవితంలో పాఠశాల చాలా కీలకం. ఆ స్థాయిలోనే తమ భవిష్యత్తు లక్ష్యం ఏమిటో నిర్ణయించుకోవాలి. హైస్కూల్ స్థాయి వరకూ నేర్చుకున్న విజ్ఞానం, క్రమశిక్షణ, అలవాట్లే భవిష్యత్తును నిర్దేశిస్తాయి. దాదాపుగా అవే జీవితాంతం కొనసాగుతాయి. అందుకే భవిష్యత్తులో మన లక్ష్యం ఏమిటో ప్రతి చిన్నారీ పాఠశాల స్థాయిలోనే నిర్ణయించుకోవాలి. ఆ లక్ష్య సాధనకు అహర్నిశలు కృషి చేయాలి.

• తల్లిదండ్రులే తొలి గురువులు...

మా సొంతూరు గుడివాడ. మా అమ్మా నాన్నా ఇద్దరూ ఉపాధ్యాయులే. వారిద్దరూ గుడివాడ మున్సిపల్ స్కూల్‌లోనే పనిచేసేవారు. నేను కూడా అక్కడే చదువుకున్నా. పిల్లలకు తొలి గురువులు తల్లిదండ్రులే. తర్వాత చదువు నేర్పే ఉపాధ్యాయులు. నా విషయంలో మాత్రం ఆ రెండు దశల్లోనూ నా తల్లిదండ్రులే దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా మా నాన్న గారి ప్రభావం ఎక్కువ. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో నాకు బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టారు. కానీ ఆయన పేరు ముందున్న డాక్టర్ అనేది పేరుతో వచ్చింది కాదు... అంబేడ్కర్ చదువుతో సాధించుకున్నది. మా నాన్న కూడా అదే చెప్పారు. డాక్టరేట్ సాధించాలనే లక్ష్యంతో చదువు కొనసాగించాను. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎమ్మే సోషియాలజీ చదివాను. అక్కడి నుంచే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాను. 2007 సంవత్సరంలో గ్రూప్-1 సాధించాను. ఉమ్మడి విజయనగరం జిల్లాలో పార్వతీపురం ఆర్డీఓగా వచ్చాను.

• చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి...

చెడు అలవాట్లు అనేవి ఎప్పుడూ జీవితానికి మంచివి కాదు. మన లక్ష్యాన్ని దెబ్బతీస్తాయి. ఇప్పుడు ఎక్కువ మంది పిల్లలపై సెల్‌ఫోన్లు, మీడియా ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ఒక మంచి ఉద్దేశంతో తీసుకొచ్చినవాటిని సరైన మార్గంలోనే ఉపయోగించుకోవాలి. పిల్లలు ఆ దిశగా వెళ్లాంటే ముందు తల్లిదండ్రులే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తమ పిల్లలు ఏం చదువుతున్నారో, పాఠశాలకో, కాలేజీకో వెళ్లిన తర్వాత ఏం చేస్తున్నారో ఏదొక సమయంలో దృష్టి పెడుతూ ఉండాలి. తల్లిదండ్రుల తర్వాతే ఉపాధ్యాయులు, ఎన్‌జీవోలు బాధ్యత తీసుకుంటాయి. పిల్లలు సరైన మార్గంలో జీవితాన్ని తీరిదిద్దుకునేలా వీరంతా మార్గనిర్దేశం చేయాలి. అలాగే పిల్లలు కూడా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పింది వినాలి. మహానుభావుల గురించి తెలుసుకుంటూ వారిని స్ఫూర్తిగా తీసుకోవాలి. అత్యుత్తమైన భావిభారత పౌరులుగా ఎదగాలి.''

చదువుల తల్లి



ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటే పేదింటి పిల్లలు చదువులో రాణిస్తారనేందుకు విజయనగరం కస్పా మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని అల్లం రిషితారెడ్డి చక్కని ఉదాహరణ. ఆమె పదో తరగతిలో ప్రతిభ చూపడంతో గత ప్రభుత్వం ఐక్యరాజ్యసమితి, ప్రపంచబ్యాంకు వేదికలపై విద్యావిధానాలపై అభిప్రాయాలను పంచుకునే అవకాశం కల్పించింది. ఇప్పుడు ట్రిపుల్ ఐటీలో సీటుసాధించి భవితను బంగారం చేసుకునే దిశగా విద్యార్థిని చదువు సాగిస్తోంది. బాలల దినోత్సవం వేళ పాఠశాల చిన్నారులందరికీ చదువుతోనే భవిత అంటూ శుభాకాంక్షలు చెబుతోంది. – విజయనగరం అర్బన్

మన చిచ్చర పిడుగులు



ఆటల్లో అదుర్స్



నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన చిన్నారులు వెయిట్‌లిఫ్టింగ్, కుస్తీ క్రీడల్లో రాటుదేరుతున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాల పంట పండిస్తున్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని ఈ ప్రాంతానికి చెందిన పలువురు చిన్నారులు ఆటల్లో రాణిస్తున్నారు. నెల్లిమర్ల ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న మజ్జి మణికంఠ గత నెల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో రెజ్లింగ్ విభాగంలో బంగారు పతకాన్ని సాధించాడు. ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు పయనమయ్యాడు. పిల్లల దినోత్సవం సందర్భంగా ఆ చిన్నారికి ఆల్‌ది బెస్ట్ చెబుదాం. – నెల్లిమర్ల రూరల్

ధన్విక రికార్డు ప్రతిభ



బొబ్బిలి మండలంలోని కొత్తపెంట గ్రామానికి చెందిన ఐదు నెలల చిన్నారి సిరికి ధన్విక 120 ఫ్లాష్ కార్డులను గుర్తించి నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో తన పేరును లిఖించుకుంది. సిరికి లక్ష్మునాయుడు, హారిక దంపతుల కుమార్తె ధన్విక రెండు నెలల వయసు నుంచే తల్లిదండ్రులు వివిధ రకాలైన వస్తువులు, బొమ్మలు తదితర సామగ్రిని గుర్తించేలా అవగాహన కల్పించారు. మూడో నెలల వయసుకు దాదాపు 120 ఫ్లాష్ కార్డులను (పక్షులు, పళ్లు, కూరగాయలు, జంతువులు, వివిధ దేశాల జెండాలు, రంగుల బొమ్మలను) గుర్తిస్తోంది. ఆమె ప్రతిభకు ప్రశంసల జల్లు కురుస్తోంది. – బొబ్బిలిరూరల్

అందాల పోటీల్లో 'ప్రీతి'కర విజయం



విజయగరం జిల్లా గజపతినగరం మండలానికి చెందిన చిన్నారి ప్రీతి పట్నాయక్ అందాల పోటీల్లో రాణిస్తోంది. చదువు, అన్ని విషయాలపైన విజ్ఞానంతో పాటు అందచందాలతో ఆకట్టుకుంటోంది. ప్రపంచ మిస్ ప్రీ టీన్‌గా ఎంపికైన ఈ చిన్నారి సౌత్ ఇండియా అందాల పోటీల్లో తలపడేందుకు సిద్ధమవుతోంది. – గజపతినగరం

అసమర్థతను ప్రశ్నిస్తే కేసులా?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్, తదితరులు

• ప్రభుత్వ తీరును తప్పుబట్టిన మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, పార్టీ రాజాం ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్

రాజాం: ప్రభుత్వ అసమర్థతను సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించేవారిపై అక్రమంగా కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేయడం టీడీపీ కూటమి ప్రభుత్వానికి తగదని విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, పార్టీ రాజాం ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. వైఎస్సార్‌సీపీ రాజాం కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడు హామీలు ఇవ్వడమే తప్ప వాటిని పూర్తిస్థాయిలో అమలుచేసిన చరిత్ర ఎప్పుడూ లేదన్నారు. గతంలో చంద్రబాబు తీరును దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి, మాజీ సీఎం రోశయ్య తదితరులు తప్పుబట్టారని గుర్తు చేశారు. 2014 ఎన్నికల ముందు కూడా చంద్రబాబు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని నెరవేర్చలేదని ఆరోపించారు. ఇప్పుడు కూడా సూపర్ సిక్స్ పేరుతో హామీలిచ్చి ప్రజలను మోసగించారన్నారు. దీనిపై సోషల్ మీడియాలో ప్రశ్నించినవారిపై కేసులు పెడుతుండడం విచారకరమన్నారు. మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలపై కూడా టీడీపీ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయని, వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారి గొంతునొక్కేయడమే లక్ష్యంగా పోలీసులతో కలిసి భయపెడుతున్నారని విమర్శించారు. అక్రమ కేసులు పెట్టినంత మాత్రాన భయపడే ప్రసక్తేలేదని, పార్టీ కార్యకర్తలకు, సోషల్ మీడియా కో ఆర్డినేటర్లకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, రాజాం జెడ్పీటీసీ సభ్యులు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, అంతకాపల్లి సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు, ఎస్.జగదీష్, రాము, ప్రసాద్, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు 'సంకల్పం'

• సైబర్ నేరాలపై అవగాహన కల్పించే షార్ట్‌ఫిల్మ్‌లకు ఆహ్వానం

విజయనగరం క్రైమ్: మాదక ద్రవ్యాల నియంత్రణకు జిల్లా పోలీస్‌శాఖ 'సంకల్పం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించేలా తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఔత్సాహికులు నిర్మించిన షార్ట్ ఫిల్మ్‌లను పోటీలకు ఆహ్వానిస్తున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బొబ్బిలి ఫిల్మ్ సొసైటీ, జిల్లా పోలీస్‌శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలుగా నిలిచిన వారికి వరుసగా రూ.8వేలు, రూ.6వేలు, రూ. 4వేలు, రూ.3వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేస్తామని చెప్పారు. వీటితో పాటూ వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన 19 మందికి జ్ఞాపికలు అందజేస్తామని తెలిపారు. పోటీకి పంపే వీడియో తెలుగు భాషలో 3 నుంచి 5 నిమిషాల నిడివి కలిగి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న ఔత్సాహికులు విజయ్ మోహన్ విహారి 94407 44741, కమల్‌కుమార్ తుంబలి 84650 33970 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, తదితరులు పాల్గొన్నారు.

ఐదు కిలోల గంజాయి సీజ్: ముగ్గురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: మండల పరిధిలోని ద్వారపూడి గ్రామ శివారులో ఐదుకిలోల గంజాయిని సీజ్ చేసి, ముగ్గురు నిందితులను రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక సబ్ డివిజనల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ద్వారపూడి శివారులో గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో రూరల్ సీఐ బి.లక్ష్మణరావు, ఎస్సై వి.అశోక్ కుమార్‌లు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోతుండగా వారిని పట్టుకుని విచారణ చేసి వారి దగ్గర నుంచి ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. నిందితుల్లో ఒకరైన మునకాల జగన్నాథం రైల్వేస్టేషన్ వద్ద గల వసంతవిహార్‌లో ఉంటున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తి దగ్గర ఐదుకిలోల గంజాయిని కొని, ద్వారపూడి దగ్గరలో జిల్లా కేంద్రానికి చెందిన బోని అఖిల్, మూర్తి వెంకట ఆదిత్యలకు చెరో కిలో అమ్మేశాడు. మిగిలిన మూడుకిలోల గంజాయితో పాటు కొనుగోలు చేసిన వ్యక్తుల వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని పోలీసులు సీజ్ చేశారని చెప్పారు. నిందితుల నుంచి రెండు మొబైల్స్, రూ. 2025 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ బి.సంజీవ్‌కుమార్ సమక్షంలో రూరల్ సీఐ నిందితులను అరెస్టు చేసి, రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారని వివరించారు. ఈ కేసులో క్రియాశీలకంగా పనిచేసిన సీఐ, ఎస్సైలను డీఎస్పీ అభినందించారు.

నిందితుల వేలిముద్రల సేకరణ తప్పనిసరి



నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

• ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: ఏడేళ్ల శిక్షపడే అన్ని కేసుల్లో అరెస్టయిన నిందితుల వేలిముద్రలను లైవ్ స్కానర్‌లో తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో పనిచేస్తున్న పోలీసు అధికారులతో బుధవారం మాసాంతర నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు తమ షాపులు, వాణిజ్య సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటును ప్రోత్సహించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా చూడాలన్నారు. డిసెంబర్ 14న జరిగే లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు డిస్పోజ్ అయ్యేవిధంగా ఇప్పటి నుంచే ప్రణాళికతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మిస్సింగ్ కేసుల్లో అలసత్వం చూపొదన్నారు. నేర సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, డీటీసీ డీఎస్పీ వీరకుమార్, ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, న్యాయసలహాదారులు వై.పరశురాం, పలువురు సీఐలు, వివిధ పోలీసుస్టేషన్‌ల ఎస్సైలు, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రశంసలు

జిల్లా పోలీసుశాఖలో విధులను సమర్థవంతంగా నిర్వహించి, మంచి ప్రతిభ కనబర్చి, వివిధ కేసులను ఛేదించిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ నేర సమీక్షా సమావేశంలో అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రశంసా పత్రాలు అందుకున్న వారిలో రాజాం సీఐ కె.అశోక్ కుమార్, సీసీఎస్ సీఐ ఎ.సత్యనారాయణ, ఎస్.కోట సీఐ వీఎన్.మూర్తి, ఎస్.కోట ఎస్సై ఎస్.భాస్కరరావు, రాజాం ఎస్సై వై.రవికిరణ్, ట్రాఫిక్ ఎస్ఐ ఎ.ఎం.రాజు, బొండపల్లి ఎస్సై యు.మహేష్, మహిళా పీఎస్ ఏఎస్సై పి.శ్రీను, సీఎంఎస్ ఏఎస్సై ఎ.విజయ కుమార్, ఎస్.కోట హెచ్‌సీ పీవీ.ఆనందరావు, టూటౌన్ హెచ్‌సీ కేఎన్.మూర్తి, రాజాం హెచ్‌సీ సీహెచ్.రామారావు, రామభద్రపురం హెచ్‌సీ జి.నాగేంద్ర ప్రసాద్, ట్రాఫిక్ హెచ్‌సీ ఏసీహెచ్.శేఖర్, ట్రాఫిక్ హెచ్‌సీ జి.సత్యంనాయుడు, సీఎంఎస్ హెచ్‌సీ సీహెచ్.రామకృష్ణ, బొండపల్లి హెచ్‌సీ ఎం.ప్రకాష్, సీసీఎస్ హెచ్‌సీ ఎం.డి.ఇమ్రాన్, సీసీఎస్ హెచ్‌సీ డి.శంకరరావు, స్పెషల్ బ్రాంచ్ హెచ్‌సీ జి.రామరాజు, ఎస్.కోట పీసీ సీహెచ్.పవన్‌కుమార్, ఎస్.కోట పీసీలు ఆర్. ఈశ్వరరావు, బి.వెంకటేష్, పూసపాటిరేగ పీసీ వి.శ్రీను, టూటౌన్ పీసీ పి.పాపినాయుడు, మహిళా పీఎస్ పీసీలు కె.శ్రీను, ఎస్.సతీష్, రాజాం పీసీలు కె.రామకృష్ణ, కె.సూరపు నాయుడు, ఎ.సంతోష్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ పీసీలు కె.మహేష్, పి.శంకరరావు, వై.అప్పారావు, ఎస్.కిరణ్‌కుమార్, ఎస్.సింహాచలం, జి.సూరపునాయుడు ఉన్నారు.



సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులు